

సాక్షి బాపట్ల
శుక్రవారం | 17 | ఫిబ్రవరి | 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 2423 క్యూసెక్కులు విడుదల చేశారు. పలు కాలువలకు 1932 క్యూసెక్కులు విడుదల చేశారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 43.1097 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 4200 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. దిగువకు 4000 క్యూసెక్కులు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్ : జిల్లా వ్యాప్తంగా గురువారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

వైభవంగా మల్లన్న తలపాగా ఊరేగింపు



వేటపాలెం: పందిళ్లపల్లిలో చేనేత మగ్గంపై నేసిన శ్రీశైల మల్లన్న తలపాగాకు గురువారం వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు చేసి ప్రత్యేక అలంకరణతో వేడుక జరిపారు. గ్రామ ప్రజలు మల్లన్న తలపాగాకు హారతులిచ్చారు. కార్యక్రమంలో దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర, బండ్లబాబు, ఏరాసు అరుణ్ బాబు, బుసం శ్రీనివాసరావు, చింతా రాము, ఒలుకుల రామంజనేయులు, కర్ణ పోలయ్య, కోనంకి నాగేశ్వరరావు, ఏరాజు బసవేశ్వరరావు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ సైక్లింగ్ పోటీలు ప్రారంభం



నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఆటల పోటీల్లో భాగంగా గురువారం డీఎస్‌ఏ స్టేడియం నిర్వహణలో అండర్-14 బాలబాలికల సైక్లింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఫెడరేషన్ పల్నాడు జిల్లా కార్యదర్శి చప్పిడి కోటేశ్వరరావు పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పోటీల పరిశీలకుడు పి.కోటేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యార్డులో 1,36,092 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,32,084 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,36,092 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,000 నుంచి రూ.25,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,200 నుంచి రూ.12,000 వరకు ధర దక్కింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 82,327 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఐదు మండలాలకు ఎంఈవోల నియామకం

గుంటూరు ఎడ్యుకేషన్: పల్నాడు జిల్లాలో ఖాళీగా ఉన్న మండలాలకు తాత్కాలిక ప్రాతిపదికన ఎంఈవోలను నియమిస్తూ పాఠశాల విద్య ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఐదు మండలాలకు ఎంఈవోలను ఎఫ్‌ఏసీలుగా బాధ్యతలు అప్పగించారు. రెంటచింతల ఎంఈవోగా గురజాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్వీఆర్ ప్రసాద్, యడ్లపాడు ఎంఈవోగా చిలకలూరిపేట ఎంఈవో కె.లక్ష్మి, అమరావతి ఎంఈవోగా పెదకూరపాడు ఎంఈవో వై.ప్రసాదరావు, పిడుగురాళ్ల ఎంఈవోగా రాజుపాలెం ఎంఈవో బి.మల్లికార్జునశర్మ, నూజెండ్ల ఎంఈవోగా వినుకొండ ఎంఈవో సయ్యద్ జఫ్రుల్లాను నియమించారు. పరిపాలన సౌలభ్యం కోసం ఆయా మండలాలకు 25 కిలోమీటర్ల పరిధిలో పనిచేస్తున్న హెచ్‌ఎం, ఎంఈవోలకు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ముగ్గురు జేసీజేల నియామకం

గుంటూరు లీగల్: రాష్ట్ర వ్యాప్తంగా నూతన జూనియర్ సివిల్ జడ్జిల నియామకాలు, మరి కొంత మంది జేసీజేలను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిలకలూరిపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా ఇనపకుర్తి స్వాతిని నూతనంగా నియమించారు. చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.నరేంద్రరెడ్డి చిలకలూరిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీపై రానున్నారు. గొల్లపూడి స్రవంతిని గుంటూరులోని స్పెషల్ మొబైల్ కోర్టుకు నూతన జడ్జిగా నియమించారు. వీరు త్వరలోనే విధుల్లో చేరనున్నారు.

కొండపై ఏకాదశి సందడి



ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వర స్వామి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



బాలప్రభలతో కొండకు వస్తున్న భక్తులు

త్రికోటేశ్వరుడిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు

- కొండపై భక్తుల రద్దీ
- రుద్రహోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి దంపతులు
- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి దేవస్థానంలో ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తుల సందడి నెలకుంది. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున స్వామి వారికి బిందె తీర్థంతో అభిషేకాలు నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయం 5 గంటల నుంచే ఆలయంలో భక్తుల రద్దీ నెలకుంది. ఉచిత దర్శనంతో పాటు శీఘ్ర దర్శనం, ప్రత్యేక దర్శన సదుపాయాలను భక్తులకు కల్పించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయంలో మూలవిరాట్ అభిషేకాలు నిలిపివేశారు. అభిషేక మండపంలో ప్రత్యేక అభిషేకాలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో అభిషేకాల్లో పాల్గొన్నారు. సోపాన మార్గంలో భక్తులు పెద్ద ఎత్తున మెట్లపూజ చేసుకుంటూ కొండపైకి చేరుకున్నారు. ఆలయం వెనుక ఉన్న రావి చెట్టు వద్ద మహిళలు పూజలు చేశారు. ధ్యాన శివుడు, నాగేంద్రుడి పుట్ట వద్ద భక్తుల రద్దీ కనిపించింది. నరసరావుపేట, చిలకలూరిపేటల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను కొండపైకి నడిపింది. ఘాట్ రోడ్డులోని ప్రకృతి పర్యావరణ కేంద్రం, కొండ దిగువన ఉన్న జలవిహార్ వద్ద యాత్రికులు ఆహ్లాదంగా గడిపారు. రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి, ఎస్ఐలు బాలనాగిరెడ్డి, హజరత్తయ్య బందోబస్తును పర్యవేక్షించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశాయి.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు..

కొండపైన ఆలయం ప్రాంగణంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గురువారం ప్రారంభించారు. చిలకలూరిపేటకు చెందిన భక్తులు తేళ్ల శ్రీధర్, తేళ్ల సుధీర్ సహకారంతో రూ.1.6 కోట్లతో నిర్మించిన అన్నదాన మండపం, రూ.40 లక్షలతో ప్రధాన ఆలయం చుట్టూ నిర్మించిన రేకుల షెడ్డు, రూ.47 లక్షలతో నిర్మించిన డార్మెంటరీ, రూ.70 లక్షలతో చేపట్టిన వసతి గృహం ఆధునికీకరణ పనులకు ప్రారంభోత్సవం నిర్వహించారు. కొండ దిగువన జలవిహార్ వద్ద రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ సహకారంతో నిర్మించిన లక్ష్మీవిజయం కళావేదికను ప్రారంభించారు. ముందుగా జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ స్వామి వారిని దర్శించుకుని ఆలయంలో దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయంలోని యాగశాలలో నిర్వహించిన రుద్రహోమం, మేధా దక్షిణామూర్తి హోమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, ఆయన సతీమణి డాక్టర్ సుస్మితారెడ్డి, కంజుల రామకోటిరెడ్డి దంపతులు, తహసీల్దార్ రమణానాయక్ దంపతులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

25 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా

తిరునాళ్లకు 25 లక్షలు నుంచి 30 లక్షల వరకు భక్తులు కోటప్పకొండకు వస్తారని అంచనా వేస్తున్నాం. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నాం. రోడ్ల విస్తరణతో పాటు పలు రహదారులకు మరమ్మత్తులు పూర్తిచేయడం జరిగింది. గతంలో జరిగిన చిన్నచిన్న లోపాలను అధిగమించి తిరునాళ్లను విజయవంతం చేస్తాం.

– లోతేటి శివశంకర్, జిల్లా కలెక్టర్

తిరునాళ్ల ఏర్పాట్లు పూర్తి

రాష్ట్రం నలుమూలల నుంచి తిరునాళ్లకు తరలివచ్చే యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. సామాన్య భక్తులు ప్రశాంతంగా స్వామి వారిని దర్శించుకుని గమ్యస్థానానికి తిరిగి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నాం. ట్రాఫిక్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించి రోడ్ల విస్తరణ చేపట్టి పనులు పూర్తిచేయడం జరిగింది. తాగునీరు, పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ఏర్పాటు చేశాం.

– డాక్టర్ గోపిరెడ్డి, ఎమ్మెల్యే

కొండకు తరలిన భారీ ప్రభలు

నరసరావుపేట రూరల్: కోటయ్య సన్నిధిలో కొలువుదీరేందుకు మండలంలోని కాకాని, గురవాయపాలెం గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు భారీ విద్యుత్ ప్రభలు గురువారం కోటప్పకొండకు బయలుదేరాయి. కాకాని గ్రామం నుంచి పద్నాలుగేళ్లుగా కోటప్పకొండకు ప్రభను తరలిస్తున్నారు. 90 అడుగుల భారీ విద్యుత్ ప్రభను బుధవారం రథంపై నిలబెట్టారు. గురువారం మధ్యాహ్నం ప్రభను కొండకు తరలించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభ ట్రాక్టర్‌ను నడిపారు. గ్రామస్తులు ఉత్సాహంగా ప్రభను తరలించే కార్యక్రమంలో పాల్గొన్నారు. చేదుకో కోటయ్య చేదుకో అంటూ శివనామస్మరణ చేస్తూ ప్రభను ముందుకు కదిలించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కంచేటి వీరనారాయణ, మాజీ ఎంపీపీ తన్నీరు శ్రీనివాసరావు, సర్పంచ్ అడపా ప్రసాద్ పాల్గొన్నారు. గురవాయపాలెం నుంచి విద్యుత్ ప్రభ మధ్యాహ్నం 3 గంటల నుంచి కోటప్పకొండకు బయలుదేరింది. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పూజలు నిర్వహించిన అనంతరం ప్రభను కొండకు తరలించారు. ప్రభ ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి నడిపారు.



గురవాయపాలెం ప్రభ ట్రాక్టర్‌ను నడపుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

అభివృద్ధి దారులు



పశ్చిమ బైపాస్ నిర్మాణం



కొత్తగా ప్రతిపాదించిన తూర్పు బైపాస్ మ్యాప్

శరవేగంగా భూసేకరణ



జిల్లా పరిధిలో జాతీయ రహదారుల విస్తరణ కోసం భూసేకరణ వేగవంతం చేశాం. పశ్చిమ బైపాస్‌కు భూసేకరణ పూర్తయి పనులు జరుగుతున్నాయి. తాజాగా తూర్పు బైపాస్ కోసం భూసేకరణ కోసం అన్ని శాఖలతో సమావేశం ఏర్పాటు చేశాం. వినుకొండ – గుంటూరు, గుంటూరు – నిజాంపట్నం పోర్టు, కొండమూడు– పేరేచర్ల జాతీయ రహదారుల విస్తరణ కోసం కూడా భూసేకరణ ప్రక్రియ జరుగుతోంది. త్వరలోనే భూసేకరణ పూర్తి చేస్తాం.

– ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా కలెక్టర్

- జిల్లాలో రెండు బైపాస్‌లు, మరో రెండు హైవేలకు ప్రతిపాదనలు
- కాజా నుంచి చినవుటుపల్లి వరకూ తూర్పు బైపాస్
- ఇప్పటికే వేగంగా జరుగుతున్న చిన్నకాకాని టూ గొల్లపూడి పశ్చిమ బైపాస్ పనులు
- పేరేచర్ల టూ నిజాంపట్నం, వినుకొండ టూ గుంటూరు కొత్త హైవేలకు ప్రతిపాదనలు
- భూసేకరణకు రంగం సిద్ధం
- మారనున్న గుంటూరు జిల్లా రూపురేఖలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు జిల్లా అభివృద్ధి వైపు పరుగులు పెడుతోంది. కొత్తగా రెండు బైపాస్‌లు, రెండు కొత్త హైవేల ప్రతిపాదనలతో గుంటూరు జిల్లా రూపురేఖలు మారనున్నాయి. జాతీయ రహదారి-16లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా గుండుగొలను నుంచి గుంటూరు జిల్లాలోని కాజా వరకూ ఆరు వరుసల రహదారి పనులు వేగంగా జరుగుతున్నాయి. దీన్ని విజయవాడ బైపాస్‌గా పిలుస్తున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే చెన్నై – కోల్‌కత్తా, హైదరాబాద్ – కోల్‌కత్తా, హైదరాబాద్ – చెన్నై వెళ్లే వాహనాలు విజయవాడ నగరంలోకి రాకుండానే వెళ్లడానికి అవకాశం ఏర్పడుతుంది. దీనివల్ల విజయవాడ నగరంలో ట్రాఫిక్ తగ్గడమే కాకుండా బైపాస్‌కు ఇరువైపులా అభివృద్ధికి బాటలు పడనున్నాయి. విజయవాడకు పశ్చిమ బైపాస్ నిర్మాణం కోసం గొల్లపూడి నుంచి చినకాకాని వరకూ, తూర్పు బైపాస్ కోసం చినకాకాని నుంచి పొట్టిపాడు వరకూ డిజైన్ చేశారు. విజయవాడ బైపాస్ నిర్మాణంలో భాగంగా చిన్నఅవుటుపల్లి నుంచి గొల్లపూడి వరకు ఆరు వరుసల జాతీయ రహదారి నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. చినఅవుటుపల్లి నుంచి గొల్లపూడి వరకు పనులను మేఘా ఇంజినీరింగ్ సంస్థ దక్కించుకుంది. ఈ పనులు చాలా వరకూ పూర్తయ్యాయి. దీనికి అనుసంధానంగా గొల్లపూడి నుంచి కాజా (చినకాకాని) వరకూ 18 కిలోమీటర్ల రహదారి పనులను అదానీ ఎంటర్‌ప్రైజెస్ దక్కించుకుంది. 1,546 కోట్ల రూపాయలతో ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే చినకాకాని నుంచి రోడ్డు పనులు, అండర్ పాస్, ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభం అయ్యాయి. ఈ ప్యాకేజీలో కృష్ణా నదిపై ఆరు వరుసల రహదారితో కూడిన వంతెన నిర్మించనున్నారు. ఆరు లైన్ల జాతీయ రహదారి మంగళగిరి, తాడేపల్లి నగర పాలక సంస్థలోని చినకాకాని గ్రామం నుంచి ప్రారంభమై మంగళగిరి, నవులూరుతో పాటు రాజధాని పరిధిలోని కృష్ణాయపాలెం, వెంకటపాలెం, మందడం మీదుగా కృష్ణా జిల్లా గొల్లపూడి వద్ద కలుస్తుంది. కృష్ణా నదిపై నిర్మించనున్న 3.2 కిలోమీటర్ల వంతెన తుళ్లూరు మండలం వెంకటపాలెం వద్ద ప్రారంభమై కృష్ణా జిల్లా సూరాయపాలెం వద్ద ముగుస్తుంది.

తాజాగా తూర్పు బైపాస్‌కు ఆమోదం

తాజాగా తూర్పు బైపాస్ పనులకు రంగం సిద్ధం చేస్తున్నారు. చినకాకాని నుంచి కృష్ణా జిల్లా పొట్టిపాడు జాతీయ రహదారి వరకు తూర్పు బైపాస్‌ను ఏర్పాటు చేయనున్నారు. చినకాకాని నుంచి మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల, కొల్లిపర మండలాల మీదుగా కృష్ణా నదిపై వంతెన నిర్మించి గన్నవరం దాటిన తర్వాత ఉన్న పొట్టిపాడు వరకూ ఈ బైపాస్ అలైన్‌మెంట్‌ను ప్రతిపాదించారు. దీనికోసం గుంటూరు జిల్లాలోని దుగ్గిరాల, కొల్లిపర, మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో సుమారు 19.750 కి.మీ. పొడవు, ఆరు లైన్ల వెడల్పుకు భూ సేకరణ చేయాల్సి ఉంటుంది. ప్రతిపాదిత ఎలైన్మెంట్‌ను ఇరిగేషన్, విద్యుత్, ఆర్అండ్‌బీ, రెవెన్యూ సంబంధిత శాఖలు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు ఇటీవల జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్ని శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ బైపాస్ పూర్తయితే మచిలీపట్నం పోర్టుకు కూడా దగ్గర అవుతుంది.

కొత్తగా రెండు హైవేల అభివృద్ధి..

జిల్లాలో రెండు హైవేలను అభివృద్ధి చేయనున్నారు. గుంటూరు – నారాకోడూరు– తెనాలి – చందోలు– నిజాంపట్నం పోర్టు రహదారిని నాలుగు లైన్లుగా అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టును చైతన్య ప్రాజెక్టు కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించారు. గుంటూరు ఔటర్ రింగ్ రోడ్డు నుంచి నిజాంపట్నం పోర్టు వరకూ ఈ రోడ్డును మొత్తం 51.490 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేస్తారు. పల్నాడు జిల్లా వినుకొండ నుంచి బాపట్ల జిల్లా సంతమాగులూరు మీదుగా గుంటూరుకు ప్రస్తుతం ఉన్న రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించనున్నారు. 91.375 కిలోమీటర్ల మేర ఈ రోడ్డును విస్తరిస్తారు. ఈ పనులను ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు అస్సిస్టమ్‌ఎస్‌టీయూపీ సంస్థకు అప్పగించారు. గుంటూరు జిల్లాలోని ఫిరంగిపురం, మేడికొండూరు, గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో 33.68 కిలోమీటర్ల మేర విస్తరణ పనులు జరగనున్నాయి. కొండమూడు నుంచి పేరేచర్ల వరకూ కొత్త జాతీయ రహదారి పనులు కూడా ప్రారంభం కానున్నాయి. దీనిలో భాగంగా మేడికొండూరు, ఫిరంగిపురం మండలాల్లో భూసేకరణ చేయనున్నారు.

ఓటర్లను ప్రభావితం చేస్తే చర్యలు తప్పవు

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

బాపట్ల: శాసన మండలి ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసే ధనం, మద్యం, ఇతర బహుమతులు పంపిణీని అధికారులు పూర్తిగా అరికట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.విజయకృష్ణన్ ఆదేశించారు. శాసన మండలి ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం ప్రారంభం కావడంతో జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్, జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసుతో స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్లో ఆమె అత్యవసర సమావేశం నిర్వహించారు. ప్రతి పౌరుడు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. ప్రజాస్వామ్యబద్ధంగా శాసనమండలి ఎన్నికలు జరగాలన్నారు. ఇందుకోసం ఎన్నికల మార్గదర్శకాలను అధికారులు అనుసరించాలని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటర్లను ప్రభావితం చేయకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం బాపట్ల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడానికి సీఎంసీఆర్ (కంప్లైయింట్స్ మానిటరింగ్ కంట్రోల్ రూమ్), కాల్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. 24 గంటలపాటు కాల్ సెంటర్ పనిచేస్తుందని, ఈ నెల 17వ తేదీ నుంచి టోల్ ఫ్రీ నంబర్ 95050 46500 అందుబాటులో ఉంచామన్నారు. ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారిగా చీరాల ఆర్డీఓ సరోజిని వ్యవహరిస్తారని తెలిపారు. ఈ నెల 23వ తేదీతో నామినేషన్ల స్వీకరణ గడువు ముగుస్తుందన్నారు. శాసనమండలి ఎన్నికలకు 200 మంది పోలింగ్ సిబ్బందిని తక్షణమే నియమించాలని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. ఎన్నికల పర్యవేక్షణ కోసం 13 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించామని, శుక్రవారం నుంచి ఆ బృందాలు ఎన్నికల విధుల్లో ఉంటాయన్నారు. ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) కోసం 13 బృందాలను నియమించామన్నారు. ముఖ్యంగా 13 మండలాల్లోని చెక్ పోస్టుల వద్ద స్టాటిస్టికల్ సర్వేలెన్స్ బృందాలను ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్‌ను కలెక్టర్ ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం మండలాల వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇప్పటికే ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో బృందాలు మూడు, ఆడిట్ బృందాన్ని నియమించినట్లు వెల్లడించారు. ఎన్నికలు జరిగే 13 మండలాలకు నియమించిన నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సమర్థంగా అమలు చేయడానికి అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. శాసనమండలి ఎన్నికల కోసం బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలను అధికారులు సిద్ధం చేయాలని తెలిపారు. పోలింగ్ బూత్‌లలో కనీస సౌకర్యాల కల్పనపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పంచాయతీల్లో కమిటీలను ఏర్పాటు చేసుకునే బాధ్యత ఎంపీడీఓలదేనన్నారు. ఎన్నికలు సజావుగా సాగడానికి ప్రణాళికలు రూపొందించుకుని నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు.

మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక స్టేజిపై పెండ్లికుమార్తె, పెండ్లి కుమారునిగా భ్రమరాంబ, మల్లేశ్వరస్వామి

పెదకాకాని: భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో (పెదకాకాని శివాలయం)లో గురువారం మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మల్లేశ్వరస్వామిని పెండ్లి కుమారుడిగా భ్రమరాంబ అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరించారు. భ్రమరాంబాదేవి అలంకారంలో అమ్మవారు భక్తులను అనుగ్రహించారు. తొలి రోజు పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సాయంత్రం 5:30 గంటలకు కోటు యలమందారెడ్డి బృందం భజన కాలక్షేపం, 6:30 గంటలకు పెదకాకాని జితదాస్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యం, 8:30 గంటల నుంచి శ్రీకృష్ణరాయభారం నాటకంలో పడకసీను, గయోపాఖ్యానం నాటకం నుంచి వార్‌సీను, సీతాకల్యాణం నాటకం సీన్లు ప్రేక్షకులను అలరించాయి. శుక్రవారం భ్రమరాంబ అమ్మవారిని వనదుర్గాదేవిగా అలంకరించడం జరుగుతుందని, ప్రత్యేక స్టేజిపై రామలింగ ప్రతిష్ఠ ఉంటుందని ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలియజేశారు.

ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

పెదకాకాని శివాలయంలో మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయంలో ఏర్పాట్లను దేవదాయశాఖ ఉప కమిషనర్ ఈమని చంద్రశేఖర రెడ్డి పరిశీలించారు. అనంతరం బ్రహ్మోత్సవాల సందర్భంగా ఐదు రోజుల పాటు ఏర్పాటు చేసిన ఉచిత అన్నప్రసాదాన్ని ప్రారంభించారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు



గోవాడ బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

గోవాడ(వేమూరు): మహాశివరాత్రి ఉత్సవాలు సందర్భంగా గోవాడ బాల కోటేశ్వరస్వామి దేవస్థానానికి విచ్చేసే భక్తులకు పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నామని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలోని అమర్తలూరు మండలంలోని గోవాడ గ్రామంలో బాల కోటేశ్వరస్వామి దేవస్థానాన్ని ఆయన గురువారం సందర్శించారు. పోలీసు బందోబస్తు ఏర్పాట్లు స్వయంగా పరిశీలించారు. పార్కింగ్ ప్రదేశం, భక్తులు ప్రవేశ క్యూలైన్లను పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా 500 మంది పోలీసులను బందోబస్తుకు నియమించడం జరిగిందన్నారు. గ్రామంలో అత్యంత ప్రాచీన చరిత్ర కలిగిన బాల కోటేశ్వరస్వామి దేవస్థానానికి మహాశివరాత్రి రోజు దాదాపు రెండున్నర లక్షల మంది భక్తులు విచ్చేసే అవకాశం ఉందన్నారు. దర్శనానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. అంతేకాకుండా మఫ్టీల్లో మహిళా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ, జిల్లా ఎస్‌బీ ఇన్‌స్పెక్టరు ఎ.శ్రీనివాసరావు, చుండూరు, వేమూరు సీఐలు బి.కళ్యాణ్ రాజ్, వెంకటేశ్వరరావు, అమర్తలూరు ఎస్ఐ అనిల్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆలయ భూములు అమ్మినా, కొన్నా చర్యలు

దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పానకాలరావు


ఆలయ భూములు పరిశీలిస్తున్న దేవదాయశాఖ ఏసీ పానకాలరావు

బల్లికురవ: దేవదాయశాఖకు సంబంధించిన భూములు అమ్మినా, కొనుగోలు చేసినా చర్యలు తప్పవని ఆ శాఖ బాపట్ల జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎం.పానకాలరావు హెచ్చరించారు. బల్లికురవ నుంచి కొమ్మాలపాడు వెళ్లే రోడ్డు ఉత్తర భాగంలో సర్వే నంబర్ 50/1లోని 7.52 ఎకరాల భూములను గురువారం ఆయన పరిశీలించారు. బల్లికురవకు చెందిన నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి శతాబ్దం క్రితం కళావంతుల పోషణకు భూములు ఇచ్చారు. కళావంతులో పోషణలో ఉన్న భూములను కొందరు రైతులు కొనుగోలు చేసి అక్రమంగా పాస్‌పుస్తకాలు పొందారని రెవెన్యూ రికార్డులో అవి నీలకంఠేశ్వరస్వామి భూములేనని అన్నారు. ఇటీవల ఎకరా రూ. 30 లక్షల ధరతో మూడెకరాల పొలాన్ని అమ్మటంతో తహసీల్దార్ సీతారత్నం దేవదాయశాఖకు నివేదించారు. వేసిన వెంచర్లను అధికారులు, తహసీల్దార్ తొలగించి, మెరక పోయించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు ఏసీ వివరించారు. అమ్మకాలు, రిజిస్ట్రేషన్‌లు చేయవద్దని మార్టూరులోని సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాయంలో ఏసీ నివేదించారు. పరిశీలనలో ఈఓ జీవీఎల్ కుమార్, నీలకంఠేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త పాల్గొన్నారు.

బాల శాస్త్రవేత్తలను తయారు చేయాలి



మాట్లాడుతున్న డీఈఓ పీవీజే రామారావు

మేదరమెట్ల: బాపట్ల జిల్లా నుంచి కనీసం ఒక బాల శాస్త్రవేత్తను తయారు చేసేలా పాఠశాలలు పనిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు అన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏటీఎల్ ఓరియంటేషన్ ప్రోగ్రాం గురువారం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న తొమ్మిది ఏటీఎల్ పాఠశాలలు విద్యార్థులకు బాగా ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కనీసం ఒక్క బాల శాస్త్రవేత్తను తయారు చేసిన ఘనత మన జిల్లాకు అందించాలని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో మిగిలిన పాఠశాలల్లో కూడా ఏటీఎల్‌ను ప్రవేశపెడతామని వివరించారు. పర్చూరు డెప్యూటీ డీఈఓ కిరణ్‌కుమార్, డీఏఓ ఎండీ సాధిక్, హెచ్ఎం బి.అంజయ్య, హబ్‌ఏటీఎల్ ఇన్‌చార్జి కె.పోతురాజు, పలు పాఠశాల ఏటీఎల్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

పీపీపీ పద్ధతిలో బస్‌స్టేషన్ కాంప్లెక్స్ నిర్మాణం

జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి విజయ్ కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న డీపీటీఓ విజయ్‌కుమార్‌రెడ్డి

అద్దంకి: పబ్లిక్, ప్రైవేట్ పార్టిసిపేషన్ పద్ధతిలో అద్దంకి బస్‌స్టేషన్, వ్యాపార సముదాయాన్ని నిర్మించేందుకు ప్రైవేటు వ్యక్తుల నుంచి త్వరలో టెండర్లు ఆహ్వానించనున్నట్లు జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి (డీపీటీఓ) విజయ్‌కుమార్ రెడ్డి అన్నారు. స్థానిక డిపో మేనేజర్ కార్యాలయంలో ఆయన గురువారం వ్యాపారులకు పీపీపీ పద్ధతిపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 100 బస్ స్టేషన్లను పీపీపీ పద్ధతిలో నిర్మించేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టిందన్నారు. అద్దంకి బస్‌స్టేషన్‌కి 3.36 ఎకరాల స్థలం ఉందన్నారు. ఇప్పుడున్న 14 ప్లాట్‌ఫామ్‌లతో పాటు మరో నాలుగు ప్లాట్ ఫామ్‌లు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా బస్ స్టేషన్‌ను నిర్మించాల్సి ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం ఉన్న బస్‌స్టేషన్‌ను పూర్తిగా తీసివేసి ఆర్టీసీ ఇంజినీరు ఇచ్చిన ప్లాన్ ప్రకారం కొత్త స్టేషన్ నిర్మాణం చేయాల్సి ఉంటుందన్నారు. ఇది పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో 33 ఏళ్ల లీజు ప్రాతిపదికన ప్రైవేటు వ్యక్తులు నిర్మించేందుకు ఆర్టీసీ అవకాశం కల్పించిందని వివరించారు. బస్‌స్టేషన్ నిర్మాణానికి సుమారు రూ. కోటి వ్యయం అవుతుందని అంచనా వేశామని చెప్పారు. స్టేషన్‌ను, వ్యాపార సముదాయాన్ని నిర్మించగలిగిన ప్రైవేటు వ్యక్తులు, టెండర్లు వేయాల్సి ఉంటుందని చెప్పారు. టెండర్లు వేసే వారు ప్రాజెక్టు వ్యయంలో 50 శాతం టర్నోవర్ సామర్థ్యం తమకు గత 4-5 సంవత్సరాలుగా ఉందని పత్రాలు చూపాలని, ప్రాజెక్టు రిపోర్టును ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. బస్ స్టేషన్‌పైన, స్టేషన్‌లో బస్సులు తిరగడానికి పోను నిల్వ ఉన్న స్థలంలో స్థానిక అధికారుల అనుమతి మేరకు లాడ్జింగ్, లాకర్ రూం, భోజనశాల, దుకాణాల గదుల వంటి వాటిని నిర్మించుకుని అద్దె వసూలు చేసుకోవచ్చని వివరించారు. అయితే బస్ స్టేషన్, దుకాణ సముదాయాన్ని నిర్మించుకున్న ప్రైవేటు వ్యక్తి 33 ఏళ్లపాటు బస్ స్టేషన్ మెయింటెనెన్స్ చేస్తూ దుకాణాల ద్వారా ప్రస్తుతం వస్తున్న రూ.10 లక్షలను నెలానెలా ఆర్టీసీకి చెల్లించాలన్నారు. ఐదేళ్లకొకసారి అద్దె పెంచుతామని చెప్పారు. సమావేశంలో ఆర్టీసీ ఏఈ వెంకటేశ్వర్లు, డిపో మేనేజర్ రామమోహనరావు, వ్యాపారులు పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

కూలికి వచ్చి కానరాని లోకాలకు..

ప్రైవేట్ కళాశాల బస్సు ఢీకొని పెయింటర్ దుర్మరణం

చీరాల: రోజూ మాదిరిగానే పనికి ఇంటి నుంచి బయలుదేరి వెళ్తుండగా మృత్యువు బస్సు రూపంలో వెంటాడటంతో కూలీ దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన కొత్తపేట పంచాయతీ ఆర్టీసీ కాలనీ సాయిబాబా గుడివద్ద గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈపురుపాలెం సిండికేట్ వీవర్స్ కాలనీకి చెందిన వాసి లక్ష్మీనారాయణ (45) పెయింటింగ్ పనులకు వెళ్తుంటాడు. రోజు మాదిరి తన సైకిల్‌పై కొత్తపేటలో పనికి వెళ్తుండగా ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బస్సు వెనుక నుంచి వచ్చి సైకిల్‌ను ఢీకొంది. దీంతో లక్ష్మీనారాయణ కిందపడి తలకి తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతుడికి భార్య దీప ఉంది. ఘటనా స్థలానికి టూటౌన్ పోలీస్‌లు చేరుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్‌ఐ చంద్రావతి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

తాబేళ్ల సంరక్షణ కేంద్రం పరిశీలన


సముద్ర తాబేళ్ల పెంపకాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్ఓ

చినగంజాం: మండలంలోని ఏటిమొగ గ్రామంలో సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రాన్ని, మడ మొక్కల ప్రాంతాన్ని బాపట్ల జిల్లా డివిజనల్ ఫారెస్ట్ అధికారి ఎల్.భీమయ్య గురువారం సందర్శించారు. రాష్ట్ర అటవీ శాఖ, ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆలీవ్ రిడ్లీ సముద్ర తాబేళ్ల సంరక్షణ జీవ వైవిధ్యం నిర్వాహణ ప్రధానమని అలాగే సముద్ర మత్స్యసంపద పెరుగుదలకు తాబేళ్ల సంరక్షణ దోహదపడుతుందన్నారు. కాలువ అంచున ఉన్న మడ మొక్కలను బోటు ద్వారా వెళ్లి పరిశీలించారు. ఎవరైనా మడ మొక్కలు నరికితే వారిమీద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో చీరాల రేంజ్ అటవీ శాఖాధికారి ఆర్.శ్రీదేవి, సెక్షన్ ఆఫీసర్స్ వై జాన్‌సన్, బీట్ ఆఫీసర్ నాగమణి, ప్రొడక్షన్ వాచర్ బాషా, రక్షణ దళ సభ్యులు వాయిల శ్రీను, అళహరి ఆంజనేయులు, ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త శవనం చంద్రారెడ్డి పాల్గొన్నారు.

భట్టిప్రోలులో విజిలెన్స్ అధికారుల దాడులు

రేషన్ బియ్యం, వాహనం స్వాధీనం


భట్టిప్రోలులో రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

భట్టిప్రోలు: అక్రమంగా రేషన్ బియ్యాన్ని భట్టిప్రోలు చుట్టుపక్కల గ్రామాలలోని కోళ్లఫారాలకు తరలిస్తున్నారనే సమాచారం మేరకు గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌరసరఫరాల శాఖ అధికారులు సంయుక్తంగా గురువారం భట్టిప్రోలులో తనిఖీలు నిర్వహించారు. స్థానిక చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేసే క్రమంలో భాగంగా లారీలో తెల్లబస్తాలతో రేషన్ బియ్యం తరలిస్తుండగా తనిఖీ చేసి 55 బస్తాలు స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్ టీఎల్ఎం ప్రసాద్‌ను ప్రశ్నించగా యజమాని డి. శ్రీనివాసరావు రేషన్‌కార్డుదారుల నుంచి రూ.13 చొప్పున కొనుగోలు చేసి రూ. 17 చొప్పున కోళ్లఫారాలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. సబ్సిడీ బియ్యాన్ని రవాణా చేస్తున్న వాహనంలోని 55 బస్తాలలోని 26.95 క్వింటాళ్ల బియ్యాన్ని లారీతో సహా స్వాధీనం చేసుకున్నారు. నిత్యవసర సరుకుల చట్టం 6-ఎ కింద కేసు నమోదు చేసి లారీ డ్రైవర్, యజమాని శ్రీనివాస్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయడం జరిగిందని విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీహరిరావు తెలిపారు. ఈ దాడులలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షేక్ సైదులు, పౌరసరఫరాల డెప్యూటీ తహసీల్దార్ రవీంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోల దొంగ అరెస్ట్

- నాలుగు ఆటోలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఎ. శ్రీనివాసరావు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఎ. శ్రీనివాసరావు

బాపట్లటౌన్: పార్కింగ్ చేసి ఉన్న వాహనాలను రెప్పపాటులోనే మాయం చేసే దొంగను పట్టణపోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. బాపట్ల పట్టణ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఎ. శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు. మాచవరం మండలం, పిన్నెల్లి గ్రామానికి చెందిన శ్రీరామ్ చిన్న ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తుంటాడు. 6 సంవత్సరాల క్రితం బాపట్ల మండలంలోని స్టువార్టుపురం గ్రామానికి చెందిన కృప అనే యువతిను వివాహం చేసుకొని అప్పటి నుంచి అక్కడే నివాసం ఉంటున్నాడు. మద్యానికి, జూదాలకు బానిసై సులువుగా డబ్బు సంపాదించాలనే ఆశతో ఆటోలు, ఆటో స్పేర్ పార్ట్స్ దొంగతనాలు చేసి వాటిని గుర్తు తెలియని వ్యక్తులకు విక్రయిస్తూ జీవనం సాగించడం పరిపాటిగా మార్చుకున్నాడు. ఈక్రమంలో వెదుళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో, చీరాల 1 టౌన్ పరిధిలో తెలంగాణ రాష్ట్రం, నల్గొండ జిల్లా, కనగాల పోలీస్ స్టేషన్, కొండమండేపల్లి మండల పోలీస్ స్టేషన్ పరిధిలో కేసులు నమోదయ్యాయి. తాజాగా బాపట్ల టౌన్ పాతబస్టాండ్‌లో రెండు ఆటోలు, పటేల్ నగర్‌లో ఒక గ్లామర్ బైక్, ఎస్ఎన్‌పీ అగ్రహారంలో ఒక ఆటో, బాపట్ల కూర గాయాల మార్కెట్ వద్ద ఒక ఆటో దొంగిలించాడు. వాహనాల తనిఖీలో భాగంగా పట్టణ ఎస్‌ఐ సింగయ్య వాహనాలు తనిఖీచేస్తుండగా దర్జాగా ఆటో తీసుకెళ్తున్న శ్రీరామ్‌పై అనుమానం వచ్చి అదుపులోకి తీసుకొని విచారించారు. అతని వద్ద నుంచి రూ. 8 లక్షల విలువచేసే 4 ఆటోలు, ఒక ద్విచక్రవాహనం, ఆటోలోని స్పేర్‌పార్ట్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ పి. కృష్ణయ్య, ఎస్‌ఐ సింగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెరగాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ విజయమ్మ


లేబర్ రూంను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ విజయమ్మ

కారంచేడు: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలను మరింత పెంచేలా వైద్యాధికారులు ప్రత్యేక చొరవ చూపాలని బాపట్ల డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.విజయమ్మ సూచించారు. గురువారం ఆమె మండలంలోని దగ్గుబాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యసిబ్బంది వారి విధులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలో గతంతో పోల్చుకుంటే ప్రసవాల సంఖ్య బాగానే ఉందని, మరింతగా పెంచాలన్నారు. ఎన్‌సీడీ సీడీ సర్వే ఇప్పటి వరకు 84 శాతం పూర్తయిందని, మిగిలిన 16 శాతం పూర్తి అవ్వకపోవడానికి కారణాలను ఆమె సీహెచ్ఓ వరలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. లేబర్ రూం, డెలివరీ గది, ట్యూబెక్టమీ ఆపరేషన్ల గది, మందుల గదులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించి ఆసుపత్రి అభివృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె సిబ్బందికి సూచించారు. అన్ని రకాల మందులతో పాటు, కుక్కకాటు, పాముకాటు వంటి వ్యాక్సిన్‌లను కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎవరూ వెనక్కి తిరిగి వెళ్లడానికి వీలులేకుండా ఉండాలని ఆమె ఆదేశించారు. గర్భిణుల్లో రక్తహీనతతో బాధపడే వారిని గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వారికి డెలివరీ సమయం వరకు అన్ని రకాల పరీక్షలతో పాటు, ఆహార నియమాలు తెలపాలన్నారు ఇమ్యూనైజేషన్ కార్యక్రమాలను సూపర్‌వైజర్లు క్రమం తప్పకుండా గమనించి ప్రతి బిడ్డకు వ్యాక్సిన్‌లు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. సీహెచ్ఓ వరలక్ష్మి, పీహెచ్ఎన్ రూతమ్మ, సూపర్‌వైజర్ సుధాకర్, శ్రీనివాసరావు, రాంమ్మోహనరావు, ఏఎన్ఎంలు, స్టాఫ్‌నర్స్‌లు, ఆశ వర్కర్లు ఉన్నారు.

ఆల్‌ఇండియా స్కేటింగ్ పోటీలకు హరికృష్ణ



అద్దంకి: త్వరలో విశాఖపట్నంలో ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నారు. పోటీలకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జట్టు తరపున ఆడేందుకు మండలంలోని తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన జ్యోతి హరికృష్ణ ఎంపికయ్యాడు. ఈ మేరకు యూనివర్సిటీ నుంచి తనకు ఎంపిక పత్రం అందినట్లు గురువారం తెలిపాడు. పోటీలకు ఎంపికైన హరికృష్ణను గ్రామంలోని పెద్దలు అభినందించారు.

రైలు ఎక్కుతూ మహిళ మృతి


గుంటూరు రైల్వే స్టేషన్‌లో మృతి చెందిన షేక్ రిజ్వానా

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే స్టేషన్‌లో తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఎక్కేందుకు వచ్చిన ఓ మహిళ కళ్లు తిరిగి కిందపడి మృతి చెందిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. బాధితురాలి కుటుంబ సభ్యులు అందించిన వివరాలు.. ప్రకాశం జిల్లా బేస్తవారి పేట ప్రాంతానికి చెందిన షేక్ రిజ్వానా(36) భర్త షేక్ ఖాజాలు బుధవారం గుంటూరులోని వారి పిల్లల వద్దకు వచ్చారు. వారితో మాట్లాడి రిజ్వానా షుగర్ టెస్ట్ చేయించుకున్నారు. గురువారం 17261 నెంబరు తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలులో తిరుగు ప్రయాణం అయ్యేందుకు భార్యాభర్తలు ఇద్దరు గుంటూరు రైల్వే స్టేషన్‌లోని 2వ నెంబర్ ప్లాట్‌ఫారం వద్దకు చేరుకున్నారు. రైలు సాయంత్రం 4.30 గంటలకు స్టేషన్‌కు చేరుకున్న వెంటనే దంపతులు రైలు ఎక్కారు. రైలు ఎక్కే సమయంలో రిజ్వానాకు కళ్లు తిరిగినట్లు ఉండటంతో తోటి ప్రయాణికుల సహాయంతో ఆమెను కిందకు దింపారు. ఫిట్స్ లాంటివి వచ్చినట్లు ఉన్నాయని కొంత మంది ప్రయాణికులు వైద్యం చేసేందుకు ప్రయత్నించారు. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది రైల్వే స్టేషన్‌కు చేరుకుని రిజ్వానాను పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు.

స్పందించని రైల్వే జీఆర్పీ పోలీసులు

మృతి చెందిన రిజ్వానా మృతి విషయమై సాయంత్రం 4.45 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు కూడా స్టేషన్ అధికారుల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాక పోయినప్పటికీ మానవతా దృక్పథంతో రైల్వే పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని తరలించిన తరువాత కూడా రాత్రి 8.45 గంటలకు స్టేషన్ అధికారులు ఆర్‌పీఎఫ్‌కు ఫిర్యాదు చేసినట్లు రైల్వే పోలీసులు చెబుతున్నారు.